ఆంధ్రజ్యోతి దినపత్రిక వారి కథావసంతం కథల పోటీలో

ఉత్తమకథగా అవార్డు పొందిన కథ!

# రియాల్టీ షో





**"రా**ణీగారి స్వయంవరానికి సెలక్టయ్యానోచ్ !"

తెలిసిన వారికీ తెలీని వారికీ కూడా నోటితో సెల్లుతో చెప్పేస్తున్నాడు నూకరాజు

ఉలిక్కిపడింది ఊరూ వాడా.

సన్నగా పొడుగ్గా రివటలా వుంటాడు. నల్లగా చెమటలు కారుతూ వుంటాడు. డిగ్రీ నాలుగోసారి చీదెయ్యడంతో చదువుకి రాం రాం చెప్పినవాడు. ఉద్యోగం సద్యోగం లేక నానా యాతనా పడుతోంటే దూరపు బంధువు చేత సినిమా రిప్రజెంటేటివ్‌గా జేర్పించబడిన వాడు. సరైన రూపూ చక్కని చూపూ లేనివాడు.

అలాటి వాడు టీవీ ఛానల్ ద్వారా వరుడ్ని ఎన్నిక చేసుకోడానికి సిద్ధపడిన సినీనటి రాణి స్వయంవరానికి సెలక్టవడం చిత్రాతిచిత్రం! వండరాతివండరం !

"ఇలా ఎలా జరిగింది నూకరాజూ ఏం మంత్రం వేశావేంటి ? " ఇంటి మీదకి దండెత్తి వచ్చి మరీ అడిగారు మిత్రులు.

"300 యస్సెమ్మెస్‌లు పంపించాను " ముసిముసిగా నవ్వేడు.

"అయితే ఒక్కోదానికీ ముప్పైనలభై రూపాయలవుతుంది గనుక దగ్గర దగ్గర పది వేలు క్షవరం....! " ఒకడన్నాడు.

"దాచుకున్నదంతా పోతేనేంరా, లక్కీ ఛాన్స్ కొట్టానుగా ! ఇక రాష్ట్రంలోనే గాక దేశ విదేశాల్లో వున్న తెలుగు వాళ్ళంతా మా ప్రోగ్రాంని ఎగబడి చూస్తారు. నేను అమాంతం సెలబ్రిటీని అయిపోతాను. మిగతా వాళ్ళ కన్నా ఎక్కువగా స్కోరు చేశాననుకో రాణీగారి రాజునై ఓ వెలుగు వెలిగేస్తాను...." పరమానందంతో ఉక్కిరి బిక్కిరవుతూ చెప్పేడు.

నోళ్ళు వెళ్ళ బెట్టేశారంతా.

ఒకవేళ నిజంగానే అలా జరిగితే హవాయ్ చెప్పుల్తో తిరిగే నూకరాజు హ్యూండాయ్ కారులో తిరుగుతాడు !

కించిత్తు అసూయ పడ్డా, " నువ్వు గెలిచి తీరాలి. మన పరువు నిలబెట్టాల్రా" అన్నారు – ఇప్పుడు వారి పరువేదో వెన్నెముక విరిగి నేల మీద దొర్లుతున్నట్టు !

వార్త ఎలా లీకయ్యిందోగాని స్థానిక రిపోర్టర్లు బిలబిలమంటూ వచ్చేశారు. ఒకరు మినీ ఇంటర్వ్యూ చెయ్యగా మిగతా వాళ్ళు దాన్ని కాపీ చేసుకున్నారు. కారబ్బూంది తిని టీ త్రాగి వెళ్ళిపోయారు.

'రాణీగారి స్వయంవరానికి నర్సాపురం కుర్రాడు' అని ఒకరూ, 'రాణి స్వయంవరానికి నూకరాజు వెడలె ' అనింకొకరు, ' రాణీ గారి వరుళ్ళలో ఒకడు మన నూకరాజే' అని మరొకరు శీర్షికలు పెట్టేరు.

అమాంతం నూకరాజు హీరో అయిపోయాడు.

అతడింట్లోంచి బయటి కొస్తే చాలు అంతా గుర్తిస్తున్నారు. పలకరిస్తున్నారు. చిరునవ్వు

చిందిస్తున్నారు. మర్యాదిస్తున్నారు. అభినందిస్తున్నారు. స్వయంవరం కథా కమామిషూ ఆరా తీస్తున్నారు.

అతడి స్టైలూ అర్థాంతరంగా మారిపోయింది. జీన్సు ఫాంటు, టీ షర్టు, నల్లకళ్ళజోడు, యాక్షన్ షూస్ .........! నడకలో మాటలో చూపులో సైతం స్టైలు వచ్చేసింది !

"ఈ గోలంతా ఏంట్రా నూకరాజూ. అంతా మెచ్చుకుంటున్నారో మొఖాన నవ్వుతున్నారో తెలీట్లేదు " నిలదీసినట్టుగానే అడిగిందతడి తల్లి.

"నా జాతకం తద్వారా మీ జాతకమూ యమగా మారిపోతున్నాయమ్మా"

"అంటే ఏమవ్వద్దంటావు ? "

"రాణి అని గొప్ప సినీనటిలే......" మాట మధ్యలో ఆపి చటుక్కున పర్సులోంచో ఫోటో తీసి చూపించాడు. " రంభలా లేదూ ?"

"రంభని చూళ్ళేదు గాని ఈ పిల్ల బాగానే వుందిరా. మొన్న టీవీలో వచ్చిన సినిమాలో సగం గుడ్డలు కట్టుకుని తెయ్‌మని గంతులేసింది ఈ పిల్లే కదా ! " మొఖం వికారంగా పెట్టుకునంది.

"అదంతా యాక్షనమ్మా. అలా చేస్తే లక్షలిస్తారు. డాన్సులే కాదు ఇంకా చాలా రకాల బుల్లి గిల్లి చెల్లి పాత్రలు కూడా వేసిందిలే. ఇప్పుడింక పెళ్ళి చేసుకుని స్థిరపడిపోదామనుకుంటోంది..."

"ఎక్కడా ?"

"ఎక్కడో అక్కడ సెటిలవుదామనన్నమాట..."

"పెళ్ళి చెయ్యడానికి ఆ పిల్లకి అమ్మా బాబూ లేరేంట్రా ?"

"వున్నార్లే గాని తనకి అన్ని విధాలా సరిపోయే వరుడ్ని సెలక్టు చేసి పెట్టమని ప్రేక్షకుల్ని కోరుతూ స్వయంవరం ప్రకటించింది. ఎన్నో వేల మంది ముందుకొచ్చారు. ఎన్నో వడబోతల తర్వాత పన్నెండు మందిని ఎంపిక చేశారు. ఆ లక్కీఫెలోస్‌లో నేనొకడ్నమ్మా" కాలరెగరేస్తూ చెప్పాడు.

"బాగానే వుంది సంబడం. మీలో ఒకడ్ని పెళ్ళడతాదన్నమాట. మనకి ఆస్తి పాస్తులు ఉద్యోగం గిద్యోగం లేవు కదరా...!"

"అయినా ఫర్లేదు. ఆమెకి నచ్చటంతో బాటు ఎక్కువ మంది ఎవరికి ఓటేస్తే వారినే పెళ్ళాడుతుందన్న మాట "

"నాకు తెలీకడుగుతానూ. ఇద్దరికి సమానంగా ఓట్లు వస్తే ఇద్దర్నీ చేసుకుంటుందిట్రా ....." బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది.

"ఛాన్సే లేదు. టై పడితే రాణీగారు తన ఓటు ఉపయోగించి ఒక్కర్నే పెళ్ళాడుతుంది"

"మరి కట్నకానుకల సంగతేంట్రా " అంతవరకూ శ్రోతలా వున్న నూకరాజు తండ్రి

అడిగాడు. ఆయనకి పుట్టెడు చెవుడుంది. మరా సంభాషణ ఎలా విన్పించిందో మరి !

"మనోడు దమ్మిడీకి చెల్లడు గాని, ఆ పిల్ల లక్షలు సంపాదించిందంట. పెళ్లైతే అవన్నీ మనవే కదా. వీడు లక్షాధికారి అవుతాడు గదా " అరిచి చెప్పింది.

"రేపు మాట మారిస్తే కష్టమెరేయ్. ముందే కాగితం మీద రాసిమ్మను. రాత కోతలకి మన కరణంగార్ని తీసుకెళ్ళు, బెసక్కుండా బిగించేస్తాడు "

"ముందు నన్ను ఫైనల్స్‌కి చేరుకోనీ. బోల్డు బోల్డు పరీక్షలుంటాయి. పాముల బారిన పడకుండా ఒక్కో నిచ్చెనా ఎక్కుతూ పైకి పోవాలి "

"పెళ్ళి చేసుకోకుండా పైకి పోవడం ఎందుకురా !"

"ఆ పైకి కాదులే " తండ్రి మీద విసుక్కున్నాడు.

"ఒరే నూకరాజు – అయితేగియితే ఆ రాణి నిన్ను పెళ్ళి చేసుకుందనుకో అప్పుడు నీతో కాపురం చేస్తుందిట్రా ?!"

"చేస్తుంది చేస్తుంది. మంచి భర్త కోసం తపస్సు చేస్తోంది తెలుసా ?" గొప్పగా అన్నాడు.

"పెళ్ళి చేసుకుంటే పెళ్ళవ్వుద్ది గాని తపస్సు చేస్తే ఏమవ్వుద్దీ గడ్డాలూ మీసాలూ వస్తాయంతే !"

"నువ్వు గమ్మునుండవయ్యా. ఆడోళ్ళకి మీసాలొస్తాయంటావు ఇంకేవన్నా అంటావు. మరైతే నూకరాజూ ఆ రాణి ఎక్కడుంటాదిరా "

"హైదరాబాదులో వుంది గాని, అస్తమానూ రాణి రాణి అనకే బావుండదు. మర్యాదగా రాణీగారూ అను...."

"హవ్వ ! కోడల్నెక్కడైనా గారూ గీరూ అంటారుట్రా ?!" నోరు నొక్కుకుంది.

"కోడలయ్యే దాకా అలా పిలవ్వే. లేకపోతే మార్కులు తగ్గిపోతాయి"

"మళ్ళీ అదో తిరకాసుందా. సరే అలాగే పిలుస్తాను గానోరేయ్. నువ్వేం చేస్తావో ఎలా చేస్తావో నాకు తెలీదు. రాణీగార్ని నా కోడలిగా తీసుకు రారా " జయసుధ లెవెల్లో అంది.

గబుక్కున ఆవిడ కాళ్ళకి దణం పేట్టేసి " దీవించమ్మా " అన్నాడు నూకరాజు.

యమ ఆశ్చర్యబోయిందావిడ !

* * *

"రెండు నెలల పాటు హైదరాబాదులో వుండాలి. అన్ని ఖర్చులూ మేమే భరిస్తాం. అందుకు సిద్ధమై వచ్చేవారం వచ్చెయ్ "

'రాణీగారి స్వయంవరం ' కార్యక్రమ నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పేరు.

ఎగిరి గంతేశాడు నూకరాజు. తుమ్మకుండానే వూడే ముక్కులాంటి ఉద్యోగాన్ని

ఛట్ ఫట్ మని తన్నేసి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు.

ఎక్కే ముందు రాణి బయోగ్రఫీని వివిధ సినిమా పత్రికల్నుంచి సేకరించి బట్టీ పట్టేశాడు.

ఎడ్రస్సు వెదుక్కుంటూ వెళ్ళాడు నూకరాజు.

తనెవరో చెప్పిన ఉత్తర క్షణాన్నుంచి వీఐపీ ట్రీట్‌మెంట్ లభించింది. కెమేరాలు వెంటబడ్డాయి. మురిసిపోయాడు.

త్రీ బెడ్‌రూం ఎపార్ట్‌మెంట్. పన్నెండుమంది అభ్యర్థులూ వచ్చేశారు. స్వపరిచయాలయ్యాయి. వారి కలల గురించడిగారు. అభిమాన నటీనటులెవరో ఆరా తీశారు. రాణీగారి గురించి ఇది వరకే మనుకున్నారు, ఇప్పుడే మనుకుంటున్నారని ప్రశ్నించారు. స్వయంవరంలో పాల్గొంటున్నందుకు మీ ఫీలింగ్సేవిటని కెమేరా ముఖం మీద పెట్టి మరీ అడిగారు.

అంతా 'అద్భుతం' 'థ్రిల్లింగ్' 'మహావరం' 'గొప్ప అదృష్టం' 'లక్కీయస్ట్ పెర్సన్ ఆన్ ఎర్త్ ' – ఆవటాని పొంగిపోతూ చెప్పారు.

వారి ప్రతి మాటా కదలికా కెమేరాలతో చిత్రీకరిస్తున్నారు. దాంతో 'హీరో' అయిపోయినట్టు ఫీలవసాగాడు నూకరాజు.

ప్రోగ్రాంలో రకరకాలుగా వారి వారి ప్రతిభ బయటపెట్టుకోవాల్సి వుంటుందని చెప్పారు. అటు ప్రేక్షకుల్నీ, ఇటు రాణీ గార్నీ మెప్పించాలన్నారు.

విజేతని రాణిగారు అంగరంగ వైభోగంగా వివాహమాడతారని తెలియజేశారు.

వారికి అవసరమయ్యే దుస్తులు, సెట్ ప్రాపర్టీలు అన్నీ తామే సమకూరుస్తామన్నారు. నృత్యగానాలకోసం మాస్టర్లచే ప్రత్యేకంగా తర్ఫీదు ఇప్పిస్తామన్నారు.

అందర్నీ స్టుడియోకి తీసుకెళ్ళారు.

రాజదర్బారు లాంటి సెట్టింగు చూసి గుమ్మైపోయాడు నూకరాజు.

రాణి వయ్యారాలొలక బోస్తూ మెరిసిపోతున్న దుస్తులు ధరించి మహారాణిలా వచ్చింది.

అందరికీ షేక్‌హేండిచ్చింది. బెస్టాఫ్ లక్ చెప్పింది. గలగలా మాట్లాడింది. తన గురించీ ప్రోగ్రాం గురించీ ప్రశ్నించింది.

అన్ని పరీక్షల్లో నెగ్గి అత్యధిక ప్రేక్షకులు ఆమోదించిన వారిని పెళ్ళాడతానని చెప్పింది. కులమతాలు గాని, ధనిక పేద వ్యత్యాసాలు గాని, ప్రాంతాలు భాషలు గాని పట్టించుకోనని తెగేసి చెప్పింది.

అన్ని విధాలా తగిన వాడు, సమర్థుడు, ప్రేమికుడు, ప్రాణాల్నైనా ఇవ్వగల సాహసికుడు భర్తగా లభిస్తాడని ఆశిస్తున్నట్టు ఆర్ద్రంగా చెప్పింది.

పెళ్ళయ్యాక భర్త అనుమతిస్తేనే సినిమాల్లో నటిస్తానని, లేకపోతే ఉత్తగృహిణిగా

వుండిపోతానంది.

ఓ అసిస్టెంటొచ్చి ఆమె చెవికొరికాడు. చిన్నగా దగ్గి " అదే...ఉత్తమ గృహిణిగా వుండి పోతానన్న మాట...." అంటూ చేతులు జోడించింది.

తప్పట్లు కొట్టారు ప్రేక్షకులు. వారిలో చాలామంది కార్యక్రమం తాలూకు వారే. మిగతా వారు అభ్యర్థుల బంధుమిత్రులు.

కార్యక్రమం మొదలైంది. ఒక ప్రత్యేక ఆసనం మీద హుందాగా కూర్చుంది రాణి. యాంకర్ వంకర్లు తిరిగి పోతూ వచ్చి తెలుగింగ్లీషులో అభ్యర్థుల్ని ప్రశ్నించింది. రాణి గురించిన రకరకాల ప్రశ్నలే అన్నీను.

తదుపరి ఎపిసోడ్‌లో రాణి యువరాణి వేషంలో సింహాసనం మీద కూర్చునుంది. అభ్యర్థులంతా రాకుమారుల వేషాల్లో వున్నారు.

ఒకొక్కరూ ఆమె దగ్గరి కెళ్ళి ఆమెని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నారో చెప్పాలి. ఆట, పాట, మాట – ఎలాగైనా ఎన్ని విధాలుగానైనా చెప్పొచ్చు – అన్నది యాంకర్.

తెలుగులో అత్తెసరు మార్కులు వాడే అయినా మిగతా వాళ్ళ కన్నా ముందంజలో వుండి ' తొలగింపు ' నుండి తప్పించుకున్నాడు నూకరాజు.

తర్వాత ఎపిసోడ్‌లో పాటలు పాడారు. తగిన తర్ఫీదు ఇప్పించారు. అయినా సెట్లో రాణి ముందు పాడటానికి చాలా ఇబ్బంది పడ్డాడు. ఆమె నవ్వుతుందేమోనని భయపడ్డాడు. మిగతా వాళ్ళ గొంతులు మరీ ఘోరంగా వుండటంతో అతడు గెలిచాడు.

పిమ్మట డాన్సులు పోటీ. రాణి మెచ్చి ఇచ్చిన పాటలకి డాన్స్ చెయ్యాలి. ఆ పాట లేవిటో చాటుగా చెప్పడమేగాక మాస్టర్ చేత ప్రాక్టీసు చేయించారు. అతడు చెప్పిన స్టెప్పుల్ని గుర్తు పెట్టుకుని ఏదోలా అయ్యిందన్పించాడు.

'ఈ దెబ్బతో అవుట్ ' అనుకున్నాడు. భయపడి నట్టే డేంజర్ జోన్లో పడ్డాడు. యస్సెమ్మెస్ ఓటింగ్ చూశారు. నూకరాజుకి ఎక్కువగా వచ్చాయి.

'బ్రతికాంరా దేవుడా ' అనుకున్నాడు. తిట్టుకుంటూనే అయినా ఖర్చుకి వెరవకుండా యస్సెమ్మెస్‌ల మీద యస్సెమ్మెస్ లిచ్చిన మిత్రులకి మనస్సులోనే థాంక్స్ చెప్పాడు.

"ఇంకా ఎక్కువ యస్సెమ్మెస్‌లు ఇచ్చేట్లు చూడండ్రా. ఇకపై కాంపిటేషన్ టఫ్‌గా వుంటుంది" అని అర్థించాడు

"నీకేం ఎన్నైనా చెబుతావు. బిల్లు పేలి పోతోంది తెలుసా. మామూలుగా పదిపైసలయ్యే మెస్సేజ్‌కి నలభై రూపాయలు మింగేస్తున్నార్రా. అదంతా ప్రోగ్రాం వాళ్ళకి వెళ్తుందిట కదా. ఆ లెక్కన వాళ్ళకి లక్షలొస్తాయి..."

వాళ్ళ మాటలు విన్పించుకోకుండా అన్నాడు " ప్లీజ్ రా. నన్ను నట్టేట ముంచకండ్రా. కనీసం గోదావరి జిల్లా ఫీలింగు తీసుకొచ్చి అయినా ఎక్కువ ఓట్లు పడేలా చూడండ్రా "

"సరే ఏం చేస్తాంలే. కడుపూ కాలూ పట్టుకునైనా అందరి చేతా వేయిస్తాం. ఇది మన ఏరియాకి ప్రెస్టేజ్ మేటరు" అని హామీ ఇచ్చారు.

అయినా నూకరాజు వాళ్ళని నమ్మి వూరుకో లేదు. ఇంట్లో తెలీకుండా ఇంటిమీద ముప్పైవేలు అప్పు చేశాడు. పదివేలు ఫ్రెండ్స్‌కి పంచి మిగతాది తను వుంచుకున్నాడు.

అయిదు కొత్త సెల్‌ఫోన్లు కొని ' ఫుల్లుగా ' రిచార్జి చేయించాడు. సమయం దొరికితే చాలు మెస్సేజ్‌లు పంపటమే పనిగా పెట్టుకున్నాడు.

ఎలాగైనా రాణిని చేజిక్కించుకోవాలన్నదే అతడి ఏకసూత్ర కార్యక్రమం !

'సవాల్ ' ఓ ఎపిసోడ్ పేరిది.

రాణి నాదంటే నాదని ఇద్దరేసి చొప్పున వాదించుకోవాలి. ఎవరి వాదన పటిష్ఠంగా వుంటే వారు నిలుస్తారు. చావు తప్పి కన్ను లొట్టపోయినా మొత్తానికి పోటీలో నిలిచాడు నూకరాజు.

తర్వాత అత్తా మామల రౌండ్. నూకరాజు తల్లీ తండ్రీ హైదరాబాదు ఎగిరొచ్చి పాల్గొన్నారు. కాబోయే కోడలి గురించి వారి అంచనాలూ, రాణి గురించి వారి అభిప్రాయాలూ ఆనందాలూ అడిగింది యాంకర్.

అదృష్టవశాత్తూ వారెక్కువగా చెప్పాల్సిన పని లేకుండా ఆవిడే అన్నీ చెప్పేసి. 'అవును కదా' అనేది. తలాడించే వారు వీళ్ళు.

ఎలాగైతేనేం ఆ గండమూ గడిచింది.

కార్యక్రమానికి రేటింగ్ పెరిగేందుకు గానూ మిగిలిన అభ్యర్థులంతా ఘర్షణ పడాలని చెప్పారు నిర్వాహకులు. అంటే ఉత్తుత్తినే గొడవ పడాలి. అదీ రాణి కోసం. సెట్లోకాదు గెస్ట్ హౌస్ ఎపార్ట్‌మెంట్లో.

గ్రూపులుగా ఏర్పడాలి. తిట్టుకోవాలి. తన్నుకోవాలి. కొట్టుకోవాలి. ఏడ్వాలి. వాకౌట్ చేస్తానని బెదిరించాలి. ఎలా చేస్తేనేం మొత్తానికి రక్తి కట్టించాలి. ప్రేక్షకులు నమ్మేలా వుండాలనీ వారి పెర్ఫార్మెన్స్‌కు మార్కులుంటాయనీ చెప్పేరు.

దాంతో అంతా పోటీ పడ్డారు. చావో రేవో తేల్చుకోవాలన్నంతగా విజృంభించేశారు. ఈ గండం దాటితే సెమీ ఫైనలే. అంచేత గొప్పగా ' జీవించేశారు '.

నూకరాజుకి దెబ్బలు తగిలాయి.

చిన్ని దెబ్బలకి పెద్దప్లాస్టర్స్ వేసి ప్రేక్షకులకి సానుభూతి కలిగేలా చూపించి చెప్పి అతడికి ఓటు వెయ్యమని కోరింది యాంకర్.

తదుపరి వారం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పట్నాలలో అభ్యర్థుల గురించీ వారి వారి విజయావకాశాల గురించీ వివిధ వర్గాల ప్రజల్ని ఇంటర్వ్యూ చేసి ప్రసారం చేశారు.

అందులో భాగంగా నర్సాపురంలోని కొందరితో బాటు నూకరాజు స్నేహితుల్ని

ప్రశ్నించారు. వాళ్ళు తప్ప మిగతా వాళ్ళెవరూ నూకరాజు గెలుస్తాడన్న నమ్మకాన్ని వ్యక్తం చేయలేదు పాపం !

దాంతో నూకరాజు బీపీ పెరిగింది. పట్టుదలా పెరిగింది. గెలిచి తీరాలనుకున్నాడు పదే పదే.

ఇంటి మీద మళ్ళీ అప్పు తెచ్చి, సెల్లుల బెల్లీ నింపి విజృంభించాడు. తనకి తనే ఎస్సెమ్మెస్‌లు ఇచ్చుకోసాగాడు !

ఆ ఎపిసోడ్‌లో రాణితో కలిసి క్లబ్ డాన్స్ చెయ్యాలి.

నూకరాజుకి 'లేలే నా రాజా ...' పాట వచ్చింది. వీడియోలో ఆ పాట చూసి చూసి అనుకరించి కొంతమేర చించి ఫైనల్స్‌లోకి దూసుకుపోయాడు.

అతడికి పోటీగా ఒకే ఒక్కరున్నారు.

ఒక ప్రక్క వెర్రి సంబరం. మరో ప్రక్క యమ టెన్షన్.

ఆఖరి పోటీ ఏవిటో ముందుగా చెప్పలేదు.

అభ్యర్థులిద్దర్నీ రాజదర్బార్ సెట్ పైభాగంలోకి తీసుకెళ్ళారు.

"మీరు నా కోసం ప్రాణాలివ్వగలరా లేదా అన్నది తేల్చే ఆఖరి పరీక్ష ఇది. ప్రాణం ఇచ్చే వారినే వరిస్తాను. ఒన్ టూ త్రీ అనగానే మీరిక్కడ్నుంచి దూకెయ్యాలి...."

రాణి మాటలకి పైనుంచి క్రిందికి చూశారు. కళ్ళు తిరిగాయి. కాళ్ళు వణికాయి.

ఉత్కంఠతో చూస్తున్నారు షో ప్రేక్షకులు. రాణి మాత్రం చిద్విలాసంగా నవ్వుతోంది.

"ఇక్కడ్నుంచి దూకితే కళ్యాణ మండపానిక్కాదు, ఎముకల డాక్టర్ దగ్గరికెళ్ళాలి " అంటూ డ్రాప్ అయిపోయాడో అభ్యర్థి.

అతడ్ని కన్విన్స్ చెయ్యడానికెంతో ప్రయత్నించింది యాంకర్. తనకొచ్చిన అన్ని విద్యల్నీ భాషల్నీ ప్రయోగించింది. కాని అతడు వినలేదు. పోటీలో వుండను పొమ్మన్నాడు.

ఇక గెలుపు నూకరాజుదే అనుకొంటూండగా పైనుంచి దూకేశాడతడు. అతడే దూకేడో వెనక నుంచెవరైనా తోశారో అతడికే తెలీదు.

'దేవుడా ! ' అనుకున్నాడు. ప్రాణభయంతో అరిచాడు.

బ్రతికిపోయాడు. క్రింద ఫోమ్ పరుపులు వేశారు మరి. నూకరాజు పిచ్చిగంతులేశాడు. పిచ్చిపట్టినట్టు అరిచాడు. గంతులేశాడు.

అతడి మెడలో వరమాల వేసింది రాణి

టపాసులు పేలాయి. తప్పట్లు మ్రోగాయి. పూలవాన కురిసింది. అభినందనలు ఎగిరొచ్చిపడ్డాయి.

"ఫలానా తారీఖున నిశ్చితార్థం. మీరంతా రావాలి ..." ప్రకటించింది యాంకర్.

తర్వాతి వారం రాణి నర్సాపురం వెళ్ళింది. అత్తమామలకు నమస్కరించి ఆశీర్వాదం

తీసుకుంది. వారికి టీ తయారు చేసిచ్చింది. ఆదరంగా మాట్లాడింది. ఇరుగుపొరుగుతో కబుర్లు చెప్పింది. తనెంతో అదృష్టవంతురాలననీ, అంచేతే నూకరాజు లాంటి భర్త లభించాడనీ ప్రెస్ వారికి గొప్పగా చెప్పింది. ఫోటోలకు ఫోజులూ ఇచ్చింది.

అదంతా కార్యక్రమంలో భాగంగా ప్రసారం చేశారు.

తదుపరి వారం రాణిని ప్రశంసిస్తూ ఆమె ధైర్యసాహసాలని మెచ్చుకుంటూ ఎందరో బుల్లి సినీ టీవీ నటీనటులు మాట్లాడారు. ఆదర్శ వివాహం, మహిళా విజయం అని ఆకాశానికెత్తేశారు. ఆమె వైవాహిక జీవితం ఆనందమయం కావాలని అభిలషించారు. అభినందించారు.

మరుసటి వారం విద్యార్థినీ విద్యార్థుల ప్రతిస్పందనని ప్రసారం చేశారు.

వారంతా ' నవశకం ప్రారంభమైంది ' ' న్యూవేవ్ ' ' కొత్తట్రెండ్ ' అంటూ షో ని ప్రశంసల్తో ముంచెత్తారు.

నిశ్చితార్థాన్ని కూడా సెట్లోనే ఇరువైపుల వారి బంధుమిత్రుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉంగరాలూ దండలూ మార్చుకున్నారు. నూకరాజు షేర్వాణీ తలపాగా ముత్యాల దండలూ ధరించగా రాణి ప్రముఖ వస్త్ర దుకాణం వారి పట్టు చీర కట్టుకుని, మరో నగల సంస్థ వారి నగలు దిగేసుకుని పెళ్ళి కూతుర్లా తయారై సిగ్గులు ఒలకబోసింది.

రాణి నూకరాజుకి ఖరీదైన సెల్ ఫోన్ బహూకరించింది.

అతడామెకు కొత్త టూ బెడ్ రూం ఫ్లాట్ తాళాలు – స్పాన్సర్స్ తరపున బహూకరించాడు.

"కమిట్‌మెంట్స్ పూర్తికాగానే పెళ్ళి చేసుకుంటాం " వినమ్రంగా ప్రకటించింది రాణి.

హనీమూన్‌కి ఏదేశం వెళ్ళేదీ ఇంకా నిర్ణయించుకోలేదని కూడా చెప్పింది.

అన్ని పత్రికలూ ఛానల్సూ ఆ వార్తని బాగా కవర్ చేశాయి. ఫొటోలు ప్రచురించాయి.

నూకరాజు ' మబ్బు 9 ' మీద చిందులేశాడు. ఇంటర్వ్యూలిచ్చాడు. 'నర్సాపురం హీరో' అయ్యాడు !

* * *

రాణికి వెయ్యోసారి ఫోన్ చేశాడు నూకరాజు. ఎప్పట్లానే స్విచ్ఛాఫ్ అని సమాధానం వచ్చింది !

ఇంటి బయటికెళ్తే చాలు పెళ్లెప్పుడని అంతా అడుగుతున్నారు. సిగ్గుతో చితికి పోతున్నాడు. వెర్రిగా నవ్వి నవ్వి బుగ్గలు సైతం నొప్పెడుతున్నాయి. రాణి లైన్ మాత్రం కలవట్లేదు !

ఇక ఇంట్లో వుంటే అప్పులోళ్ళు యముడి వేషాలేసుకొచ్చి పీకల మీద

కూర్చుంటున్నారు.

మరో ప్రక్క తండ్రి తిట్లు, తల్లి శాపనార్థాలు – అతడి బతుకు నరకమైపోయింది !

పట్టు వదలని విక్రమార్కుడై ప్రోగ్రాం నిర్వాహకులకి ఫోన్ చేశాడు.

"ఎవరూ ? "

"నూకరాజుని "

"అయితే ఏంటి ?"

"రాణితో నిశ్చితార్థం అయ్యింది కదా..."

"అది ఆవిడ్నే అడుగు "

"నెంబరు దొరకట్లేదు "

"మాకూ దొరక లేదు "

లైన్ కట్ చేశారు.

ఇలా కాదని హైదరాబాద్ వెళ్ళాడు. తిన్నగా రాణి ఇంటికి దూసుకెళ్ళాడు. కుక్క అరుపులకి చల్లబడ్డాడు. రాణి తల్లి కలిసింది.

"అదంతా నిజమనుకుంటున్నావా పిచ్చోడా. డ్రామా ! " పడీ పడీ నవ్వింది అతడి ఆమాయకత్వానికి !

పిచ్చిగా చూశాడు. వెర్రిగా నవ్వాడు.

ఇప్పటికీ వెర్రిగా నవ్వుతూనే వున్నాడు.....

అతడు మీ కెప్పుడైనా కన్పిస్తే పెళ్లెప్పుడని మాత్రం దయచేసి అడక్కండి! 'బకరా'లానూ చూడకండి, ప్లీజ్ !

* * *

**(ఆంధ్రజ్యోతి దినపత్రిక, 1-8-2010)**

**(కన్నడంలోకి అనువదింపబడినది)**